# మనిషి-కుక్క

(ఒక ప్రణయగాథ)

'ఆ-బతకదూ? నా హీరా బతకదూ?' పెదవి విరిచి తల అడ్డంగా వూపిన వెటరినరీ డాక్టర్ని అడిగాడు దీనంగా-కుక్కను తీసుకు వచ్చిన యువకుడు.

'లాభం లేదండీ, పిచ్చికుక్క కరచిన కుక్క బతకదు.'

'వీల్లేదు—ఎన్నటికి వీల్లేదు-నా హీరా చావటానికి వీల్లేదు. డాక్టర్, ఎట్లాగైనా దీన్ని బతికించండి ఊఁ అనండి-బతికిస్తానని అనండి' యువకుడు ఆవేశంతో అన్నాడు.

ఆ జంతువుకోసం అతడు పడుతున్న ఆవేదన చూసి డాక్టరు ఆశ్చర్యపోయాడు. మాసిన దుస్తులు-చెదిరిపోయిన క్రాపు-ఆవేశంతో కూడిన మాటలు-ఇవన్నీ చూసి ఇంకో సందేహంకూడా కలిగింది-ఆ కుక్క ఇతడినికూడా కరిచిందేమోనని.

అనుమానిస్తూ తనవైపు చూస్తున్న డాక్టరు కేసి చూస్తూ యువకుడు మళ్ళీ అన్నాడు-

'మీరు డబ్బుకోసం అనుమానిస్తారేమో, నా వేషాన్ని చూసి నాకు విలువ కట్టకండి. ప్రజలు నన్నో ధనవంతుడని అనుకోవాలని నాకు వుండదు. కాని నేను ధనవంతుణ్ని. నా దగ్గర వున్న ధనమంతా-ఆఖరు దమ్మిడీతో సహా-దీని ప్రాణం కాపాడటంకోసం ఖర్చు పెట్టటానికి వెనుతియ్యను. మీదగ్గరవున్న మంచి యింజెక్షన్లన్నీ దీనికి యివ్వండి. సందేహించకండి. మీ శ్రమకు తగిన ఫలితం వుండకపోదు' అంటూ రెండంగుళాల దళసరినివున్న పది రూపాయిల నోట్లకట్ట జేబులోంచి తీసి బల్లమీద పెట్టాడు. డాక్టరు మరింత ఆశ్చర్యంతో అన్నాడు-

'నేను డబ్బుకోసం సందేహించటం లేదండీ. మిమ్మల్ని యీ కుక్క కరిచిందేమోనని భయపడుతున్నాను. ఎందుచేతంటే పిచ్చికుక్క కరచిన కుక్కకి పిచ్చెక్కుతుంది. ఆ కుక్క మనిషిని కరిస్తే మనిషికికూడా పిచ్చెక్కటమేకాక పది రోజుల్లో ప్రాణాపాయంకూడా కలుగుతుంది-రేబిస్ చాలా అపాయకరమైన వ్యాధి.'

'ఏమన్నారూ?-నా హీరా నన్ను కరుస్తుందా హీరా-నన్ను కరుస్తావా?-ఏదీ కరు' అని యువకుడు తన చేతిని నోరుతెరచి రొప్పుతూ చొంగ కారుస్తూ బల్లమీద పడివున్న కుక్కనోట్లో పెట్టాడు.

'వద్దు...ప్రమాదం!' అని పెద్ద కేక పెట్టాడు డాక్టర్.

యువకుడు డాక్టరు చేసిన హెచ్చరికను లక్ష్యం చెయ్యకుండా తన చేతిని కుక్క నోట్లో మరింత లోపలికి పోనిచ్చాడు. కుక్క కరవ లేదు. అతి కష్టంమీద వేలపడివున్న తలను పైకెత్తి ప్రేమతో ఆప్యాయంగా ఒక్కసారి అతడి చేతిని మృదువుగా నాకి మళ్ళా తల వేలేసింది. ఆ కుక్కనీ, కుక్క యజమానునీ చూసి డాక్టర్‌కి జాలివేసింది. కాని ఏంలాభం? కుక్క ఏ క్షణంలోనైనా చావవచ్చు. అంతగా బతికితే పది రోజులకన్న ఎక్కువ బతకదు. అయినా తాత్కాలికంగానైనా ఆ యువకుడికి మనశ్శాంతి కలిగిద్దామని అన్నాడు-

'నా శక్తి కొలదీ ప్రయత్నించి చూస్తాను. మీరు మాత్రం యీ కుక్క విషయమై అనవసరంగా బాధ పడకండి'

'డాక్టరు, యీ కుక్కని మీ చేతుల్లో పెట్టాను. దీన్ని కాపాడే బాధ్యతమీది' అని అంటూ యువకుడు కన్నీరు బొటబొటా కార్చటము మొదలు పెట్టాడు.

డాక్టరతడికి అనేక విధాల ధైర్యం చెప్పి యింటికి పంపించటానికి ప్రయత్నించాడు. కాని యువకుడు యింటికి వెళ్లటానికి

కొండేపూడి సూర్యకామరాజు

పోవ్వలేదు. ఇంతలో చీకటి పడింది. డాక్టరు అతనిని తనతో భోజనం చెయ్యమన్నాడు. కాని అతడు అంగీకరించలేదు. డాక్టరు భోజనం చేసి వచ్చాక అతికష్టంమీద అతడిచేత కప్పుకాఫీ మాత్రం తాగించ గలిగాడు. కుక్కకి పాలు పోయించాడు. కాని అది పాలు ముట్టుకోలేదు. ఆహారానికి బదులు గ్లూకోజ్ యింజక్షనూ-నిద్రపట్టటానికి మార్ఫియా యింజక్షనూ ఇచ్చాక కుక్క బాధ కొంతవరకు తగ్గింది. చొంగ కార్చటము, రొప్పటం మాని ప్రశాంతంగా నిద్రపోతోంది. అప్పటికి యువకుడు కొంత కుదుటపడ్డాడు. కుక్క పడుకుని వున్న గదికి ఆనుకుని వున్న వరండాలో చెరొక మంచం మీద యిద్దరూ పడుకున్న తరవాత డాక్టర్ అన్నాడు:

'మీరు కుక్కను గూర్చి యింత ఆందోళన చెందటం నాకు మిక్కిలి ఆశ్చర్యాన్ని కలుగ జేస్తున్నది'

'ఈ కుక్కకూ నాకూ గల ఆత్మీయత, కష్ట సమయాల్లో అది నామీద కనపరచే సానుభూతి తెలిస్తే మీరు ఆ విధంగా అనరు'

అతడికి వచ్చిన కష్టాలేమిటో ఆ కుక్క అతడికి ఏ విధంగా సానుభూతి చూపిందో చెప్పమని డాక్టరడిగాడు. ఆ యువకుడు చెప్పడం మొదలు పెట్టాడు—

'హీరా నా దగ్గరకు వచ్చి ఆరునెలలు దాటలేదు. అయినా మా యిద్దరకీ సన్నిహితమైన సంబంధం ఏర్పడింది. ఈ ప్రపంచంలో నిజంగా నన్ను ప్రేమించినవాళ్లు యిద్దరే - ఒకటి మా అమ్మ. రెండవది హీరా! ఇంకా కొంతమంది స్త్రీలు, పురుషులూ కూడా నన్ను ప్రేమిస్తోన్నట్టుగా నాతో చెప్పారు. డాక్టర్, యిక్కడ ఒక విశేషం వుంది. మనిషికి నోరువుంది. భాష ఏర్పరచుకున్నాడు. తన మనసులో ఎంత చెడు తలపెట్టినా తన నోటిద్వారా - నోటితో మాట్లాడే భాషద్వారా - మనసులో వున్న కుళ్ళుకు మారువేషం వేసి మంచి వాడిలా కనపడటానికి ప్రయత్నిస్తాడు. అంటే మానవుడి మనస్సుకీ నోటికీ సంబంధం లేకుండా పోయింది. అందువల్ల నిజంగా వాళ్లు నన్నే ప్రేమిస్తున్నారో లేక నా డబ్బుకోసంకాని, వాళ్ల స్వప్రయోజనాలు సాధించుకోటం కోసం కాని నన్ను ప్రేమిస్తున్నట్టుగా నటిస్తున్నారో తెలుసుకోవటానికి ఏమీ అవకాశం లేదు. జంతువులలో అట్లా కాదు. అవి మనసులో ఏమి అనుకుంటే అది చేసేస్తాయి. అందువల్ల జంతువుల్లో మోసాలూ, ద్రోహాలూ వుండవు. అందువల్లే నేను హీరాని మనిషికన్న ఎక్కువ ప్రేమతో, గౌరవంతో చూస్తాను—'

డాక్టర్ మౌనంగా వింటున్నాడు. అతడు తిరిగి చెప్పటం మొదలుపెట్టాడు—

'నాకు పన్నెండేళ్ళు దాటి పన్నెండేళ్లయింది. ఈ పన్నెండేళ్లలోనూ అనేక మానసిక వ్యథలకు గురయ్యాను. ఆ బాధలన్నీ నేను స్వయంగా తెచ్చిపెట్టుకున్నవే. నా స్థానంలో వున్న మరెవ్వరూ ఆ బాధల్ని కావాలని తెచ్చిపెట్టుకోరు. అసలు నేను ఏ పరిస్థితుల్లో బాధ పడతానో ఆ పరిస్థితులు బాధకు కారణంగా ఎవ్వరూ అనుకోరు—ఎవరో బస్సుకింద పడితే వాడికోసం కనీసం పదిరోజులు బాధపడ్డాను. నేనొకసారి హాస్పిటల్‌కు వెడితే మందు కొనుక్కోటానికి పదిరూపాయలు యిమ్మని ఒక అనాథస్త్రీ అడిగింది. ఇచ్చాను. మందు కొనుక్కొని తాగింది; కాని నాలుగురోజుల తరవాత ఆమె చనిపోయింది. ఆ మందు తాగటంవల్లే ఆమె చనిపోయిందని నా భయం. దాన్ని గురించి యిప్పటికీ బాధపడుతుంటాను. బీచిలో రోజూ తప్పనిసరిగా ఒక ముసలాయనను చూసేవాడిని. ఒకసారి వరసగా మూడురోజులు ఆయన కనపడలేదు. నాలుగోరోజున ఆయన కనపడేదాకా ఎంత బాధపడ్డానో యిప్పుడు చెప్పలేను. మా పక్క యింట్లో రోజూ సాయంత్రం కొంతమంది పిల్లలు ఆడుకునేవారు. వాళ్లల్లో చురుగ్గా ఛెంగ్‌మని బంతిలాగ గెంతుతూ ఆడే నల్లటి అమ్మాయి వుండేది. ఆ అమ్మాయి ఒకరోజు ఆ ఆడేవాళ్ళల్లో కనపడకపోయేటప్పటికి ఎంత వింత ఆలోచనలతో మనసు పాడుచేసుకున్నాను—ఆ అమ్మాయికి జబ్బు చేసిందేమో- ఆమెకు మందిచ్చే డాక్టరు మంచివాడో కాదో- వాళ్ళ-వాళ్ళు సరిగ్గా మందూ అవీ ఇస్తోన్నారో లేదో - అర్థరాత్రివేళ ఆ అమ్మాయికి దాహం వేస్తుందేమో- ఎవళ్ళ కయినా మెలకువవచ్చి మంచినీళ్ళు యిస్తారో

లేదో- పోనీ నేనే వెళ్ళి కొంచెం మంచినీళ్ళు తాగించివస్తే!- ఈ విధమైన ఆలోచనలతో ఆ రాత్రి నిద్రలేకుండా గడిపాను. ఇటువంటిస్వల్పమైన- నాకు సంబంధంలేని- సంఘటనలు నా మనస్సును బాధపెట్టటమే కాకుండా నా దినచర్యనీ- దాన్నిబట్టి నాజీవితాన్నీ కొంతవరకూ మార్చేసేవి- నా రేకెట్ పార్ట్నర్‌కి తగిలిందని టెన్నిస్ మానేశాను. పందిపిల్ల కారుకింద పడి చచ్చిందని కారు డ్రయివింగ్ మానేశాను- మనిషికి ఏదన్నా బాధకలిగితే మౌనంగా లోపల లోపల ఏడవటం చాలా కష్టమైనపని. తనబాధ ఆప్తులకు విప్పిచెప్పి కాస్సేపు బిగ్గరగా ఏడిస్తే కాని హృదయ బాధ, గుండెబరువూ తగ్గవు. చిన్న చిన్న విషయాల్ని కేలామిటీస్ లాగా అనుకుని బాధపడి అమ్మను కౌగలించుకొని ఆమెతో చెప్పి ఏడ్చేవాడ్ని. అమ్మ నన్ను బుజ్జగించి 'అటువంటి చిన్న విషయాల్నిగూర్చి బాధ పడకూడదనీ, అసలవి బాధపడే కారణాలే కావనీ' ధైర్యం చెప్పి ఓదార్చేదాకా నాకు మనశ్శాంతి వుండేదికాదు. సుమారు అయిదారునెలలనుంచీ అమ్మతో చెప్పటానికికూడా వీలులేని - నన్ను విపరీతంగా బాధపెట్టే సంఘటనలు జరుగుతున్నాయి. ఆ విషయాల్లో అమ్మ ఓదార్పూ, సానుభూతీ పొందటానికికూడా నాకు అవకాశంలేకుండా పోయింది. ఆ లోటు హీరా తీర్చింది. కొన్ని విచిత్రపరిస్థితుల్లో నా కొక యువతి పరిచయం కలిగింది. కొన్నాళ్ళకి ఆ పరిచయం స్నేహంగానూ, ఆ స్నేహం ప్రేమగానూ మారింది. నన్ను పెళ్లాడమని ఆమెను కోరాను. ఆమె సమ్మతించింది. కాని రోజులు గడచిన కొద్దీ నా చర్యలు ఆమెకు విపరీతంగా తోచినాయి నా హృదయం లోకి ఆమె పూర్తిగా తొంగిచూడలేక పోయింది—నన్ను అర్థం చేసుకోలేక పోయింది. ఏదో పనుండి నేను మద్రాసు వెళ్ళి వచ్చేసరికి ఆమె మరొక యువకుడిని వివాహమాడింది. నేను బాధపడ్డాను. కాని ఆమెమీద కోపం కాని విరోధభావంకాని నాకు కలగలేదు. ఆమెను చూడటానికి వెళ్లాను. తనకు పెళ్ళయిందనీ, తనని చూడటానికి రావద్దనీ, తనతో మాట్లాడవద్దనీ ఆమె నాతో చెప్పింది. ఆమె మాటలు విని ఆశ్చర్యపోయాను. నిజానికి ఆమెకు పెళ్ళయితే ఆమెను చూడకూడదనీ, ఆమెతో మాట్లాడకూడదనీ ఎక్కడ వుంది? తనకు పెళ్ళవటం నాకూ సంతోషమేననీ, తనమీద నాకు ఏమీ కోపంలేదనీ, గతాన్ని మరచిపోయి నన్ను తన అన్నవలె చూడమని ఆమెతో చెప్పాను—ప్రార్థించాను. కాని ఆమె నన్నొక అసహ్యకరమైన వస్తువును చూసినట్టుగా చూడటం ప్రారంభించింది. నే నెన్నడూ ఆమెకు హాని తలపెట్టలేదు. మనస్సు కష్టపెట్టే ఒక్క మాట కూడా ఆమెతో అనలేదు. అటువంటప్పుడు ఆమెకు నామీద ఎందుకంత కోపం!—అన్యాయం! డాక్టర్, నేనూ సైకాలజీని గురించి చాలా పుస్తకాలే చదివాను. కాని యీ ఆడవాళ్ల సైకాలజీ నాకేమీ అర్థం కాలేదు—అది మొదలు ఆడవాళ్ల మనస్తత్వం కనిపెట్టటం కోసం అనేకమంది స్త్రీలను క్లోజ్‌గా అబ్జర్వ్ చెయ్యటం మొదలుపెట్టాను. స్త్రీలది సంకుచిత దృక్పథం. వాళ్లల్లో కల్చర్ ఏమాత్రమూ లేదు. బిగించికట్టిన బ్రేసియర్—ఒంటికి అతుక్కుపోయేటట్టు కుట్టిన బ్లవుజ్—లోపల కట్టుకున్న పరికిణీ చివరలేసు డిజైను స్పష్టంగా కనిపించేటంత ట్రాన్సుపెరెంట్ చీర మొదలయిన సెక్సు అప్పీల్‌కి సాధనాలైన వాటిని నాగరికతకు చిహ్నాలుగా అనుకుంటారు; కాని నాగరికత—దాని సరైన అర్థంతో—వాళ్లలో ఎక్కడా కనిపించదు ఇంతమాత్రమే వాళ్లను గూర్చి నేను కనిపెట్టగలిగింది'

'అయితే మీరు స్త్రీజాతిని ద్వేషిస్తారన్న మాట' డాక్టరు అడిగాడు.

'అక్కడే మీరు పొరపడుతున్నారు. నేను స్త్రీలను ద్వేషించను. వాళ్లు లేకపోతే మనం పుట్టుకే వుండదన్న సత్యాన్ని నే నెప్పుడూ మర్చిపోను కాని మానసికంగా పురుషులకంటే చాలా అడుగున వున్నారు స్త్రీలు. వాళ్లను పైకి తీసుకువచ్చే బాధ్యత మనమీదే వుంది. కాని యిక్కడ యింకో యిబ్బందివుంది. ముందువాళ్ల సంకుచిత దృక్పథం పోతేకాని మనం వాళ్ళకేమీ సహాయం చెయ్యలేము. మన సహాయాన్ని స్వీకరించే విశాల హృదయం వాళ్లకు వుండనూ వుండదు; ముఖ్యంగా వాళ్ళల్లో విద్య వ్యాప్తి

చెండాలి-విద్యంటే నా వుద్దేశ్యం కాలేజీలో పలికించే చిలక పలుకులుకావు సుమండీ-విజ్ఞానాన్ని, మానసిక వికాసాన్ని యిచ్చే విద్య కావాలి-క్షమించండి, అసలు విషయం వదిలేసి చాలా దూరంగా వెళ్ళినట్టున్నాను - మర్నాడు ఆమె మరొక వూరు వెడుతున్నట్టు తెలిసింది. ఏమైనా సరే వెళ్ళి ఒకసారి చూసివద్దామని బయలుదేరాను. ఆమె నన్ను చూసి మేడమీదకు వెళ్ళి నౌకరుచేత యింట్లో లేరని చెప్పించింది. డాక్టర్, మీరు చెపితే నమ్మరుకాని, ఆవేళ నేనుపడిన బాధ నా వయస్సులోవున్న మరొకరెవరూ పడివుండరేమో. మౌనంగా ఆ విషయాన్ని మనస్సులో తల్చుకొని ఏడవటం నాకు దుర్భరమైంది. ఎవళ్ళతోనన్నా చెప్పుకుని ఏడవాలనిపించింది. అమ్మకు యీ విషయాలన్నీ అర్థంకావు. చెప్పటానికి సాహసంకూడా లేకపోయింది. ఆ అర్థరాత్రి సమయంలో హీరాను బీచికి తీసుకుపోయి దానితో చెప్పి ఏడ్చాను. హీరా సానుభూతితో నన్ను నాకింది. ప్రపంచం కుక్కనుచూసి ఛీఛీ అంటుంది. కాని అటువంటి ఆకుక్క సానుభూతే నా బాధయొక్క తీవ్రతను చాలవరకూ తగ్గించింది. హీరాయే లేకపోతే ఆవేళ సముద్రంలో పడి చచ్చిపోయేవాడినేమో కూడాను. ఆ రాత్రే-ఆ బీచిలోనే-హీరాను పిచ్చికుక్క కరిచింది. పాపం నా హీరా పిచ్చికుక్క నన్ను కరవపోతుంటే ఎంతో విశ్వాసంతో తను అడ్డుకుని దానికాటుకి తనే గురయింది. హీరాను కరవకుండా నన్నే కరిచివుంటే నేను చాలా సంతోషించేవాడిని - నేను బతికివుండి ఏం చెయ్యాలి డాక్టర్?'

పట్టుమని పాతికేళ్ళయినా లేని ఆయువకుడు జీవితంమీద విరక్తి భావంతో మాట్లాడటం చూసి డాక్టరన్నాడు.

'మీకింకా పెళ్ళీ అదీ కావలసివుంది. మీ జీవితం అంతా ముందేవుంది. మీరట్లా నిరాశతో మాట్లాడుతారేం?'

'పెళ్లి-ఆకలి లేనివాడు అన్నం బలవంతాన నోట్లో కూరుకుంటే ఎట్లావుంటుందో నేను పెళ్లి చేసుకుంటే అట్లావుంటుంది-ఆవుత్సాహం నాలో చచ్చిపోయింది డాక్టర్.'

డాక్టరేదో అనబోయాడు. ఇంతలో కుక్క మూలుగు వినపడింది. ముందు యువకుడు పరుగెత్తాడు. వెనకాల డాక్టరు వెళ్ళాడు. కుక్క యువకుడి వైపు నిశ్చలంగా చూసింది. ఆ చూపు తిన్నగా అతడి గుండెలోకి పోయి గుచ్చుకొన్నట్టయింది. మెల్లగా చెయ్యి దానినోటి దగ్గర పెట్టాడు. కుక్క నీరసంగా అతడి చేతిని ఒకసారి నాకింది. తర్వాత చిన్న మూలుగు. యువకుడు డాక్టరు వైపు చూశాడు. డాక్టరు తల కిందకు దించాడు.

'మీ ఉద్దేశ్యం?...మీ ఉద్దేశ్యం? చెప్పండి నా హీరా కేమైందో?' డాక్టరు భుజాల్ని పట్టుకుని బలంగా వూపాడు.

డాక్టరు మాట్లాడలేదే. యువకుడు డాక్టరును కౌగలించుకుని ఏడవటం మొదలుపెట్టాడు. కుక్క నిశ్శబ్దంగా బల్లమీద పడివుంది.

హీరా యువకుడికోసం చచ్చింది. యువకుడు హీరాకోసం చావలేదు. అయితేనేం హీరా జంతువు; యువకుడు మనిషి!

వార్తా పత్రికలో ఎవరో తెలివైనవాళ్లు యీ ప్రకటన చేశారు:

"నిన్న సాయంకాలం అయిదు గంటలకు గాంధీరోడ్డులో నేను పారేసుకున్న మనీపర్సు ఎవరి చేతికి చిక్కిందో తెలిసిపోయింది. అంచేత ఆయన అది మర్యాదగా తెచ్చి యిచ్చేస్తే బాగుంటుంది."

రెండు రోజుల తరవాత అదే పత్రికలో యీ ప్రకటన పడింది:

"పర్సు పారేసుకున్న ఆసామీ ఎప్పుడయినా సరే దొరికిన ఆసామీ దగ్గరకు వచ్చి పర్సు నిరభ్యంతరంగా తీసుకోవచ్చు."